క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి



తేమశాతం పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని జగిత్యాల డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు అన్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల, జగ్గాసాగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. కొనుగోళ్లలో జాప్యం జరగవద్దని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లర్లకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీఎస్ ఉమాపతి, ఏపీఎం విమోచన, సీసీ వెంకటరమణ, ఏఈవో భూమేశ్వర్,రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి డీఈవో సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డీఈవో

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న శ్రీపాద వెంకటరాములు ఇటీవల పదవీ విరమణ పొందగా, శనివారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ మౌంట్‌కార్మెల్ పాఠశాలలో డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా హిందీ పండిట్ ఫోరం కన్వీనర్ కస్తూరి శ్రీధర్, కో–కన్వీనర్ రఫియొద్దీన్, శ్రీనివాస్, మహిళ కో–కన్వీనర్ నీలిమ, సలహాదారు వంకరయ్య, సభ్యులు సుధాకర్, వసంతరావు, కవిత పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గొల్లపల్లి: ఓబీసీ రిజర్వేషన్ పితామహుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతి వేడుకలు గొల్లపల్లిలో వైస్ ఎంపీపీ ఆవుల సత్యం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు నర్సాపురం రవీందర్, కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కచ్చు కొమురయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర నరేష్, ఆవుల లచ్చన్న, సతీశ్, ఆవుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలవాసికి గోల్డ్‌మెడల్



అవార్డు అందుకుంటున్న అరిగెల అభినవ్

జగిత్యాల: పట్టణానికి చెందిన అరిగెల అభినవ్ ఎంఎస్ జనరల్ సర్జరీలో గోల్డ్ మెడల్ సాధించాడు. అభినవ్ అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రిసెర్చ్‌లో ఎంబీబీఎస్ డిగ్రీ పూర్తి చేశాడు. అనంతరం డాక్టర్ డీ.వై.పాటిల్ మెడికల్ కళాశాల హాస్పిటల్ పుణేలో మాస్టర్ ఆఫ్ సైన్స్ జనరల్ సర్జరీ పూర్తి చేశాడు. అందులో తన అత్యుత్తమ ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. శనివారం పుణేలోని డాక్టర్ వై పాటిల్ విద్యాపీఠం ఆడిటోరియంలో మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం అభినవ్ మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో జూనియర్ రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. అభినవ్ జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరిగెల అశోక్ కుమారుడు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన చొప్పరి నవీన్‌కు చెందిన మొబైల్ ఫోన్ నెల రోజుల క్రితం పోగొట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ టెక్నాలజీతో ట్రాక్ టెస్ట్ చేసి మొబైల్‌ను పట్టుకుని అతడికి అప్పగించినట్లు ఎస్సై అనిల్ శనివారం తెలిపారు.

ముందుకు సాగని ‘అభివృద్ధి’

- నత్తనడకన దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధి పనులు
- రూ. 84.50 లక్షలతో చేపట్టిన పనులు
- సాంకేతిక కారణాలతో పనుల్లో జాప్యం



దుబ్బరాజన్న ఆలయ ప్రాకార పనుల్లో భాగంగా నిర్మించిన బేస్‌మెంట్

సారంగాపూర్: జిల్లాలోని అతిపెద్ద శైవక్షేత్రం దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పనులు కొనసాగుతున్నా, కనీసం 10 శాతం పనులు కూడా ఇప్పటి పూర్తి కాలేదు.. సాంకేతిక కారణాలతోనే నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

దుబ్బరాజన్న ఆలయం..

జగిత్యాల జిల్లా కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం స్వయంభూగా వెలసింది. ప్రతి మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల్లో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. ప్రతి పండగ, సోమవారం, శనివారం రోజుల్లో స్వామివారి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు...

ఆలయ అభివృద్ధి పనులు..

ఎమ్మెల్సీ కవిత ఎంపీగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని భక్తులు కోరడంతో దేవాదాయ శాఖ నుంచి అనధికారింగా రూ. 84.50 లక్షలు మంజూరు చేస్తున్నామని 2018–19 సంవత్సరంలో ప్రకటించినా, ఆ తరువాత 2021–2022 సంవత్సరంలో అభివృద్ధికి దేవాదాయశాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి.

నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు

దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధికి రూ. 84.50 లక్షలు మంజూరు కాగా, ఈ నిధులతో ఆలయం చుట్టూ వేములవాడ ఆలయం తరహాల్లో ప్రాకార నిర్మాణం (కాంపౌండ్ వాల్) ఆలయం ముందు రాజగోపురం, మిగిలిన నిధులతో కోనేరు వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించి, రెండేళ్ల క్రితం టెండర్లు పూర్తి చేశారు.

ప్రస్తుతం పనుల ప్రగతి అంతంత మాత్రమే

ఆలయం చుట్టూ ప్రాకార నిర్మాణం కోసం చేపట్టిన పనులు ఏడాది కాలంగా బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయాయి. ఆలయం చుట్టు బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన ముందటి భాగంలో కొంత నిర్మాణం చేసి వదలిపెట్టారు.

పలు సాంకేతిక కారణాలు..

ఆలయం చుట్టూ ప్రాకార నిర్మాణం కోసం ఓ భక్తుడు పనులు ప్రారంభించే ముందు స్వామివారికి కొంత భూవిరాళంగా అందిస్తానని పేర్కొనడంతో, ఈ దిశగా నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ తరువాత భూవిరాళం విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఏర్పడి పనుల్లో జాప్యం జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఆలయంలోని వివిధ గదులు పాతవి కావడంతో వాటిని తొలగించే విషయంలోనూ మరికొంత జాప్యం జరిగింది. వీటితో పాటు మరిన్ని కారణాలు ఆలయ అంతర్గతంగా ఏర్పడి, అవి పరిష్కారానికి చాల సమయం పట్టినట్లు తెలుస్తుంది. కాగా పనులను ప్రారంభించడంపై ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు.



దుబ్బరాజన్న ఆలయం

భక్తుల విరాళాలే ఆలయానికి అధికం..

ఇప్పటికే ఆలయానికి భక్తులు అందించిన భారీ విరాళాలతో ఆలయంలో కొత్తగా పెద్ద ఎత్తున విశ్రాంతి గదులు, ఆలయం చుట్టు భక్తులు సేదదీరడానికి షెడ్ల నిర్మాణాలు, వీటితో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించిన రాజగోపుర నిర్మాణం ఎత్తు మరింత పెంచడానికి భక్తులు లక్షలాది రూపాయలు అందించడానికి ముందుకు వస్తున్నారు..

పనులు వెంటనే ప్రారంభించాలి



దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి. ఇప్పటికే పనులు చేపట్టడంలో చాలా జాప్యం జరగడంతో విరాళాలు అందించిన భక్తులు కూడ కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షించి పనులు పూర్తి చేయాలి.

– వాసం శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు, పెంబట్ల

వారం రోజుల్లో ప్రారంభిస్తాం



పనులు ప్రారంభించడంలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవం. వారం రోజుల్లో పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. కొన్ని సాంకేతిక లోపాలతో పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఉన్నతాధికారులతో సహకారంతో పనులు సకాలంలో పూర్తి చేయిస్తాం.

– అనూష, దుబ్బరాజన్న ఆలయ ఈవో

అర్వింద్ గెలుపు కోసం సిడ్నీలో కారు ర్యాలీ



ఆస్ట్రేలియాలో ర్యాలీలో పాల్గొన్న ఓఎఫ్ బీజేపీ నాయకులు

రాయికల్: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆస్ట్రేలియాలోని ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ (ఓఎఫ్‌బీజేపీ) ఆధ్వర్యంలో సిడ్నీలో శనివారం కారు ర్యాలీ నిర్వహించారు. ఓఎఫ్‌బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ధర్మపురి అర్వింద్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషిచేసి మోదీని హ్యాట్రిక్ పీఎం చేయాలన్నారు. మరోసారి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలంగాణ కన్వీనర్ ఇన్‌చార్జి నవనీత్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, రోహిత్, చంద్రశేకర్, రవిశంకర్, సుశాంక్, వినీత్, ఉమామహేశ్వర్, ప్రదీప్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని లండన్‌లో ప్రచారం



రాయికల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని లండన్‌లోని ఎన్ఆర్ఐ బీఆర్‌ఎస్ యూకే అధ్యక్షుడు దూసరి అశోక్‌గౌడ్ కోరారు. శనివారం ఎన్ఆర్ఐ బీఆర్‌ఎస్ యూకే కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎన్నిక కోసం సోషల్ మీడియ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతు ఆత్మహత్యలు, విద్యుత్ సమస్యలపై ఎక్కువగా ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు. సో కార్యక్రమంలో అడ్వైజయిరీ బోర్డు వైస్ చైర్మన్ సిక్క చందుగౌడ్, ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి, సభ్యులు రత్నాకర్, సత్యమూర్తి, రవి, ప్రదీప్, జాఫర్, సురేష్, ప్రవీణ్‌కుమార్, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హన్మాండ్లు



నియామక పత్రం అందిస్తున్న జీవన్‌రెడ్డి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పాతదాంరాజుపల్లికి చెందిన బోయిని హన్మాండ్లుని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోయిని హన్మాండ్లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీసీల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌గౌడ్, రాష్ట్ర బీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు కొమొరెడ్డి కరం, విజయ్ ఆజాద్, జువ్వాడి కృష్ణారావు, నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్ ఆలయ కమిటీ కార్యవర్గం

వెల్గటూర్: మండలంలోని పాశిగామ గ్రామ హనుమాన్ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపతి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా బరుపటి అజయ్, వైస్ చైర్మన్‌గా బరుపటి జనార్దన్, కోశాధికారిగా ఎంబడి శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా కంటెం మధూకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దీక్షలు ప్రారంభం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం పలువురు అంజన్న దీక్షలను స్వీకరించారు. ఆలయ అర్చకులు హన్మాన్ భక్తులకు మాలాధారణ చేశారు.

15న బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

సారంగాపూర్: మండల కేంద్రంలో ఈ నెల 15న బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ హాజరుకానున్నారని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతల్లో గుబులు



మల్యాలలో ధాన్యంపై కప్పిన కవర్లు

పెగడపల్లి/మల్యాల/కథలాపూర్: మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం చిరుజల్లులు పడటంతో ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని రైతులు కలవర పడుతున్నారు. ఆరబోసిన ధాన్యం కాపాడుకునేందుకు కేంద్రాల వద్దకు రైతులు పరుగులు పెడుతున్నారు. మబ్బులు కమ్ముకోవడం, చిరు జల్లులు పడుతుండటంతో ధాన్యం కుప్పలపై పరదాలు కప్పుతున్నారు. కేంద్రాల నిర్వహకులు సరిపడా కవర్లు అందుబాటులో ఉంచక పోవడంతో కిరాయి పరదాలు తెస్తున్నారు. ధాన్యం తూకం ప్రారంభం కాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం తూకం చేయడం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు



అంబేద్కర్ వేషధారణలో చిన్నారుల ప్రదర్శనలు

రాయికల్: పట్టణంలోని వివేకవర్ధిని ప్రైమరీ పాఠశాలలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను శనివారం ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కైరం సత్యంగౌడ్ అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : ఎండపల్లి మండలం కొత్తపేటలో జేఎమ్మార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి మహేందర్‌రెడ్డి ప్రతీ ఏడాది చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జీరెడ్డి మహేందర్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వలసల జోరు

- నెల వ్యవధిలో కాంగ్రెస్‌లోకి..
- క్యూ కడుతున్న కౌన్సిలర్లు, ఎంపీటీసీలు
- బీఆర్‌ఎస్ కుదేలు..
- పార్టీ పటిష్టానికి జువ్వాడి వ్యూహం



కోరుట్ల: కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకుని పార్టీని పటిష్టం చేసే దిశలో కాంగ్రెస్ వేగంగా అడుగులు వేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ పట్టు పెంచడానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి బ్రదర్స్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తూనే మరో వైపు చేరికలకు తెర దీశారు. నెల రోజుల వ్యవధిలో కాంగ్రెస్ పార్టీలోకి కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లోని సుమారు 12 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, మరో ఇద్దరు ఇతర పార్టీల కౌన్సిలర్లు చేరడంతో పాటు పదుల సంఖ్యలో ఎంపీటీసీలు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల జువ్వాడి నర్సింగరావు లాధ్వర్యంలో పార్లమెంట్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మన్, ఆది శ్రీనివాస్‌ల సమక్షంలో ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు కాంగ్రెస్‌లోకి చేరడం విశేషం.

జోరుగా చేరికలు..

నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఎక్కడా లేని విధంగా కోరుట్ల సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ నుంచి వలసలు జోరుగా సాగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో మెట్‌పల్లి మున్సిపాలిటీలో ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతో పాటు మరో కౌన్సిలర్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి చేరారు. ఇదే రీతిలో కోరుట్ల మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 9 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఒక బీజేపీ కౌన్సిలర్ ఇప్పటి వరకు కాంగ్రెస్‌లో చేరారు. మొత్తం కోరుట్ల సెగ్మెంట్ పరిధిలో సుమారు 35 మంది వరకు ఎంపీటీసీలు,సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలోకి చేరడం గమనార్హం. నెల రోజుల వ్యవధిలో ఇంత పెద్ద ఎత్తున పార్టీలో చేరికలు జరగడం చర్చనీయంగా మారింది.

ఫలిస్తున్న వ్యూహం..

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కోరుట్ల సెగ్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున మెజార్టీ చేకూర్చాలన్న లక్ష్యంతో కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వ్యూహాత్మకంగా వ్యవహరించడం విశేషం. సెగ్మెంట్‌లోని కీలక పట్టణాలైన కోరుట్ల, మెట్‌పల్లిలో జువ్వాడి ప్రతిపక్ష పార్టీల కీలక నేతలను సంప్రదిస్తూ కొత్తవారితో పాటు ఇతర పార్టీల్లో ఉన్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇస్తూ పార్టీని బలోపేతం చేసే దిశలో ముందుకు సాగుతున్నారు. త్వరలో కోరుట్ల సెగ్మెంట్‌కు చెందిన ఓ బీజేపీ కీలక నేత కాంగ్రెస్‌లోకి చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాగే చేరికలు కొనసాగితే పార్లమెంట్ ఎన్నికల్లో కోరుట్ల సెగ్మెంట్‌లో కాంగ్రెస్ ముందంజలో ఉండే అవకాశం ఉంది.

కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉచిత బస్సు సౌకర్యం, 250 యూనిట్ల విద్యుత్ ఉచితం, రూ.500 కే సిలిండర్ ఇలా మహిళల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కస్తున్న ఎస్సై, సిబ్బంది

ధర్మపురి: పట్టణంలోని పోలీస్ స్టేషన్లో శనివారం ఎస్సై ఉదయ్‌కుమార్ చేతుల మీదుగా అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న వారోత్సవాల్లో భాగంగా అమరులైన అగ్నిమాపక సిబ్బందికి జోహార్లు అర్పించడం, అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రజలను చైతన్య వంతులను చేయడం తదితర అంశాలను వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది లక్ష్మీనారాయణ, కృపాకర్, ఎండీ రఫిక్, అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ గెలుపు

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ నాయకులు మాజీ ఏఎంసీ చైర్మన్ బోయినపల్లి సత్యంరావు, హమీద్ అన్నారు. శనివారం వారు మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలోనూ కాంగ్రెస్ పార్టీకి మంచి మద్దతు వస్తుందన్నారు. ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావు నేతృత్వంలో కాంగ్రెస్‌కు మంచి మెజార్టీ వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కొంతం రాజం, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం పాల్గొన్నారు.

అంజనశ్రీకి అభినందన



అంజనశ్రీని సన్మానిస్తున్న వీరయ్య

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన కూచిపూడి కళాకారిణి, దివ్యాంగురాలు అంజశ్రీని శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజనశ్రీ ప్రభుత్వం తరుపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా పద్మావతి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

గొల్లపల్లి: మండలంలోని బొంకూర్, వెన్గుమట్ల సరిహద్దులోని శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం, పల్లకి సేవ వైభవంగా జరిగాయి. పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణానికి వేద మంత్రోత్సవాల మధ్య కన్నుల పండువగా జరిపారు. రెండుగ్రామాల భక్తులతో పాటు మండలంలోని వివిధగ్రామాలకు చెందిన భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్‌రావు, మాజీ సర్పంచ్ కందుకూరి సత్యనారాయణ, గుడ్ల లక్ష్మీరాజయ్య, శ్రీధర్, డీలర్ కాంతరావు,తదితరులు పాల్గొన్నారు.

శ్రీ శివ భక్తమార్కండేయ స్వామి కల్యాణం

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో శనివారం శ్రీ శివ భక్తమార్కండేయ స్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొమిరెడ్డి కరం, విజయ్‌ఆజాద్, బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, సాంబారి ప్రభాకర్, గుంటుక విష్ణు, ద్యావనపల్లి రాజారాం పాల్గొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు శివపార్వతుల కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పద్మశాలీ నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.